# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 298 | శుక్రవారం 14 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# బడ్జెట్‌పై కసరత్తు

**2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిన ఆర్థిక శాఖ**

- ఈనెల 18వ తేదీ వరకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు చేరాలని ఆర్థిక శాఖ స్పష్టం
- నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ కోసం కసరత్తు
- అన్ని శాఖలు వివిధ పథకాల పద్దులకు సంబంధించిన క్షుణ్ణంగా సమీక్షించుకొని ప్రతిపాదనలు ఇవ్వాలని స్పష్టం

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 2024-, 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరింది. ఈనెల 18వ తేదీ వరకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు చేరాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024,-25 సంవత్సరానికి మొత్తం రూ.2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా పేర్కొంది.ఈ బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం - మిగతా3లో



## రాష్ట్రంలో క్యాంటీన్‌లు!

- మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్షంతో ఏర్పాటు
- రాష్ట్రంలో మహిళా శక్తి - క్యాంటీన్ సర్వీస్‌ల ఏర్పాటు
- సీఎస్ శాంతి కుమారి
- రెండేళ్లలో 150 మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడి
- కలెక్టరేట్లు, బస్టాండ్లు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటు
- బెంగాల్‌లో దీదీ కా రసోయి, కేరళలో అన్నక్యాంటిన్లపై అధ్యయనం చేసినట్లు వెల్లడి

హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో 'మహిళా శక్తి - క్యాంటీన్ సర్వీస్'లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్రంలో క్యాంటీన్ సర్వీస్‌ల ఏర్పాటుపై నేడు సచివాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఆరోగ్య శాఖ కమీషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమీషనర్ హనుమంత రావు, టూరిజం శాఖ డైరెక్టర్ నిఖిల, - మిగతా3లో




## మల్లారెడ్డికి టీటీడీపీ బాధ్యతలు?

- ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు వార్తలు
- దాదాపు ఆరుగురు నేతలు ఇప్పటికే అధినేత చంద్రబాబుతో మంతనాలు జరిపినట్టు సమాచారం
- అదే జరిగితే కారు పార్టీ ఖాళీ కావడం ఖాయమని చర
- ఈసారి బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లలో తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లినవారే
- ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడును తట్టుకోలేకపోతున్న బీఆర్ఎస్‌లోని చాలామంది నేతలు
- ఈ క్రమంలో సొంతగూటికి చేరుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు వార్తలు

## లోకల్ ఎన్నికల తర్వాతే

# కొత్త పీసీసీ



- ఎడతెగని పంచాయితీలా కాంగ్రెస్‌లో పీసీసీ పీఠం
- రేవంత్ నాయకత్వంపై ఎలాంటి సందేహం లేకుండా పూర్తి నమ్మకం పెట్టుకున్న అధిష్టానం
- ఈ సారి మాత్రం పీసీసీ పీఠం విషయంలో సీనియర్లంతా ఎవరికి వారే తమకే ఇవ్వాలని పట్టుబడుతున్న వైనం
- బీసీ వర్గానికి చెందిన నేతనే ఈ సారి పీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని అధిష్టానం భావన
- స్థానిక ఎన్నికల తర్వాతే పీసీసీని మారిస్తే సరిపోతుందనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం
- ఎందుకంటే అందరూ సీనియర్లే కాబట్టి ఎవరికి ఇచ్చినా మిగిలినవారు గ్రూపులుగా విడిపోవచ్చు
- స్థానిక ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఓకే అనిపించుకుంటే ఇక ఐదేళ్ల దాకా ఢోకా లేదని భావిస్తోన్న అధిష్టానం

హైదరాబాద్

తెలంగాణలో పీసీసీ పీఠం కాంగ్రెస్‌లో ఎడతెగని పంచాయితీలా మారేలా ఉంది. గతంలో సీఎం సీటుకు కూడా ఈ స్థాయిలో పోటీలేదని ఆ పార్టీ వర్గాలే అంటున్నాయి. అయితే అధిష్టానం మాత్రం రేవంత్ నాయకత్వంపై ఎలాంటి సందేహం లేకుండా పూర్తి నమ్మకం పెట్టుకుంది. అయితే ఈ సారి మాత్రం పీసీసీ పీఠం విషయంలో సీనియర్లంతా ఎవరికి వారే తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. బీసీ వర్గానికి చెందిన నేతనే ఈ సారి పీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని అధిష్టానం - మిగతా3లో



## నీటి కొరతకు చర్యలేవి

- ఆప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- న్యూఢిల్లీలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉంది
- మంచి నీటి సరఫరా కోసం.. అప్పర్ యమునా రివర్ బోర్డ్ (యూవైఆర్బీ)తో సంప్రదింపులు జరపాలి
- నీటి కొరత తీర్చేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్న
- అలాగే నగరంలో ట్యాంకర్ మాఫియా నియంత్రణతోపాటు మంచి నీటి వృధా కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు

## ఆ ప్రాజెక్ట్‌కు పేరు మారుస్తాం



- 6 నెలల్లో చాలా ప్రాజెక్టులు సందర్శించా
- గత ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు చాలా అన్యాయం చేశారు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- కేసీఆర్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు: భట్టి విక్రమార్క
- పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం

జిల్లాలోని ములకలపల్లి మండలం పూసగూడెం వద్ద సీతారామ ప్రాజెక్టు పంప్ హౌస్‌ను తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈరోజు (గురువారం) పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అధికారులు ఇచ్చారు. - మిగతా3లో



## జాతీయ భద్రతాసలహాదారుగా మరోసారి అజిత్ దోవల్

- జాతీయ భద్రతాసలహాదారుగా మూడోసారి అవకాశం
- ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రాకు అవకాశం
- ప్రధాని సలహాదారులుగా అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌ల నియామకం

## ఫోన్ ట్యాపింగ్... రంగంలోకి ఈడీ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు
- ఈ కేసు వివరాలను ఈడీ అధికారులు ఎప్పటికప్పుడు ఆరా
- త్వరలో ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారిన అక్రమ నగదు లావాదేవీల మీద విచారణకు ఈడీ వచ్చే అవకాశం
- ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు మీద తెలంగాణ పోలీసులు నాంపల్లి కోర్టులో చార్జిషీటు దాఖలు




హైదరాబాద్

తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరగబోతోందా? ఈ కేసు వివరాలను ఈడీ అధికారులు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారా? త్వరలో ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారిన అక్రమ నగదు లావాదేవీల మీద విచారణకు ఈడీ వచ్చే అవకాశముందా? అంటే.. అవుననే ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు మీద తెలంగాణ పోలీసులు నాంపల్లి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీంతో ఈడీ రాక ఖాయమనే వాదన మొదలైంది. - మిగతా3లో

# నీటి కొరతకు చర్యలేవి

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో మంచి నీటి కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో మంచి నీటి సరఫరా కోసం.. అప్పర్ యమునా రివర్ బోర్డ్ (యూవైఆర్బీ)తో సంప్రదింపులు జరపాలని ఆప్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యూఢిల్లీలో నెలకొన్న పరిస్థితులు నేపథ్యంలో మానవతా దృక్పథంతో మంచి నీటిని సరఫరా చేయాలంటూ యూవైఆర్బీకి ఈ రోజు సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. ఇది సున్నితమైన అంశమని అభివర్ణించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ధర్మాసనం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ప్రసన్న బి వరాలే ఆదేశించారు. ధర్మాసనం ఆదేశాల నేపథ్యంలో ఢిల్లీకి మంచి నీటి సరఫరా అంశంపై అప్పర్ యమునా రివర్ బోర్డ్ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. న్యూఢిల్లీలో మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు బుధవారం మండిపడింది. నీటి కొరత తీర్చేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అలాగే నగరంలో ట్యాంకర్ మాఫియా నియంత్రణతోపాటు మంచి నీటి వృధా కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారని ఆప్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. ట్యాంకర్ మాఫియా నియంత్రించడంలో పోలీసుల జోక్యం



చేసుకోవాలని ఆదేశించమంటారా? అంటూ ఆప్ ప్రభుత్వానికి మొట్టి కాయలు సైతం వేసింది. మరోవైపు ప్రజలకు సరఫరా చేస్తున్న మంచి నీటి పైపుల్లో నీరు ఉండడం లేదు... కానీ మంచి నీటి ట్యాంకర్ల పైపుల్లో నిత్యం నీరు ఎలా ఉంటుందంటూ ఆప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించిన విషయం విధితమే. ఆ క్రమంలో ఈ అంశంపై గురువారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## సురక్షిత, సుసంపన్న భారత్ ఆవిష్కరణ : రాజ్‌నాథ్ సింగ్



మోదీ 3.0లో రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదేండ్లలో తన విజన్ గురించి వివరించారు. మరింత భద్రమైన, స్వయం సమృద్ధితో కూడిన సుసంపన్న భారత్ ఆవిష్కారానికి కృషి సాగిస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రక్షణ పరికరాలు, సాయుధ దళాల ఆధునికీకరణ, సైనిక సంక్షేమం వంటి రంగాల్లో ప్రధానంగా తాము దృష్టి కేంద్రీకరిస్తామని మంత్రి పేర్కొన్నారు. రాబోయే సంవత్సరాల్లో డిఫెన్స్ ఎగుమతులను భారీగా పెంచే లక్ష్యంగా ముందుకు సాగుతామని వివరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగ ఎగుమతులు రూ. 21083 కోట్లకు చేరుకున్నాయని 2028-29 నాటికి రూ. 50,000 కోట్ల ఎగుమతుల లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సాయుధ దళాలు అన్ని సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు అత్యాధునిక ఆయుధాలు సమకూరుస్తామని చెప్పారు.

## మోదీ సర్కార్ నిర్వాకంతో అంధకారంలో 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం



నీట్ పరీక్షలో జరిగిన అక్రమాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ నిర్వాకంతో నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గందరగోళంగా మారిందని దుయ్యబట్టారు. నీట్ పరీక్షలను మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకేజ్ సహా పలు అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. నీట్ పరీక్షలో గ్రేస్ మార్కులు ఒక్కటే సమస్య కాదని, ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని, అవినీతి వంటి ఎన్నో లోటుపాట్లు, అవకతవకలు చోటుచేసుకున్నాయని ఖర్గే ఆరోపించారు. పరీక్షా కేంద్రాలు, కోచింగ్ కేంద్రాలు కుమ్మక్కయ్యాయని ఖర్గే అన్నారు. డబ్బులు చెల్లించి పేపర్ తీసుకునే గేమ్ నడిచిందని దుయ్యబట్టారు. నీట్ స్కామ్‌లో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఈ కుంభకోణానికి కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

### కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్..

## తెలుగు రాష్ట్రాలకు శుభవార్త!

**న్యూ ఢిల్లీ:** టీడీపీ యంగ్ ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 01:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమానయాన శాఖ అప్పగించారన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు.

**ఆ ముగ్గురికీ ధన్యవాదాలు!**

'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తాను. 100 రోజుల ప్రణాళిక తయారు చేస్తాం. 2047 నాటికి సివిల్ ఏవియేషన్‌లో ఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం. సామాన్య ప్రయాణికుల కోసం ఈస్ ఆఫ్ ఫ్లైయింగ్‌పై దృష్టి పెడతాం. పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం. భవిష్యత్తులో 100 శాతం పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని రామ్మోహన్ చెప్పారు.




**తెలుగు రాష్ట్రాలకు శుభవార్త!**

'ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తాం. సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తాం. విమానయాన రంగానికి పునాదులు వేసిన వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఉడాన్ స్కీమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణం చేరువైంది. జ్యోతిరాదిత్య సింధియా సూచనలు తీసుకున్నాను. డీజీ యాత్రను విమానాశ్రయాలకు విస్తరిస్తాం. సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం. మోదీ, చంద్రబాబు విజనరీ లీడర్స్. వారిద్దరి లిడర్ షిప్‌లో పౌర విమానయాన శాఖను ముందుకు తీసుకువెళతాను. భోగాపురం ఎయిర్ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేసి విమానాలు ల్యాండ్ చేస్తాం. విజయవాడ, తిరుపతికి కనెక్టివిటీ పెంచుతాం. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తాను. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్‌ను ఏపీ నుంచి ప్రారంభిస్తాను. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారిగా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తాం. విజయవాడ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేస్తాం. విజయవాడ ఎయిర్ పోర్టు కనెక్టివిటీ పెంచుతాం' అని కేంద్ర మంత్రి రామ్మోహన్ మీడియాకు వెల్లడించారు.

## దేశ ప్రజలు మోదీ నాయకత్వాన్ని తిరస్కరించారు

ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని విస్పష్టంగా తిరస్కరించారని కాంగ్రెస్ పేర్కొంది. బీజేపీకి వ్యతిరేకంగా వచ్చిన ఈ ఫలితాలు ప్రధాని మోదీ వ్యక్తిగత వైఫల్యంగా తాను పరిగణిస్తానని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ అన్నారు. ముకుల్ వాస్నిక్ గురువారం అహ్మదాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి నైతిక ఓటమి ఎదురైందని పేర్కొన్నారు. భారత ప్రజలు మోదీ నాయకత్వాన్ని తిరస్కరించారని, ప్రజలు తాము ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు, అంశాల వారీగా మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు.




## 'నీట్' పరీక్షలో గ్రేస్ మార్కులు రద్దు: సుప్రీం కోర్టు

ఢిల్లీ: వైద్య విద్య కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(%చీజుజు%)లో ఇకపై గ్రేస్ మార్కులు ఉండబోవని సుప్రీంకోర్టు(%ాబజూతీవఎవ జశీబతీ%) స్పష్టం చేసింది. నీట్, యూజీ 2024 పరీక్షను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. నీట్ కౌన్సెలింగ్‌ని ఆపేది లేదని కోర్టు స్పష్టం చేసింది. నీట్ 2024కి హాజరైన 1,563 మంది విద్యార్థుల గ్రేస్ మార్కులను రద్దు చేస్తామని, వారు మళ్లీ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. వారికి జూన్ 23న మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని వెల్లడించింది. మళ్లీ పరీక్ష రాయడానికి ఇష్టపడని వారికి గ్రేస్ మార్కులు లేకుండానే ఫలితాలు ప్రకటిస్తామని కోర్టు వివరించింది. నీట్-యూజీ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలు హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కోరింది. ఈ విషయమై తాము అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బుధవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. కొందరికి గ్రేస్ మార్కులు కేటాయించడం, పేపర్ లీక్, ఇతర అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలంటూ కోర్టులు ఆదేశించిన నేపథ్యంలో ఎన్టీఏ ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. ఏడు హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టులోనూ ఈ అంశంపై పిటిషన్లు దాఖలయ్యాయని ఎన్టీఏ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను జూలై 5కు వాయిదా వేసింది. మరోవైపు 1500 మందికి పైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ 'ఫిజిక్స్ వాలా' సంస్థ సీఈవో అలఖ్ పాండే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పాండే పిటిషన్‌తో పాటు మరో రెండు పిటిషన్లపై గురువారం విచారణ జరిపింది. నీట్-యూజీ పరీక్షలో కొద్ది మంది అవకతవకలకు పాల్పడితే పేపర్ లీకైనట్లు కాదని ఎన్‌టీఏ డీజీ సుబోధ్ సింగ్ అన్నారు. ""నీట్-యూజీ పరీక్షకు సంబంధించి 63 మంది విద్యార్థులు అక్రమాలకు పాల్పడినట్లు తెలింది.

## జాతీయ భద్రతాసలహాదారుగా మరోసారి అజిత్ దోవల్ నియామకం

జాతీయ భద్రతాసలహాదారుగా మరోసారి అజిత్ దోవల్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ భద్రతాసలహాదారుగా ఆయనకు అవకాశం ఇవ్వడం ఇది మూడోసారి. అలాగే, ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రాకు మరోసారి అవకాశమిచ్చినట్లు తెలిపింది. జూన్ 10వ తేదీ నుంచి ఆయన బాధ్యతల్లో ఉన్నారని ఈరోజు వెల్లడించింది. ప్రధాని సలహాదారులుగా అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌లను నియమించినట్లు పేర్కొంది.

## ఘోరం.. ఒక ట్రైన్‌లో తల, మొండె.. మరో ట్రైన్‌లో కాళ్లు, చేతులు..



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. రెండు వేర్వేరు రైళ్లలో ఓ బాలికకు చెందిన శరీర భాగాలు బ్యాగుల్లో మూటకట్టి పెట్టారు దుండగులు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసును ఛేదించేందుకు రెండు రాష్ట్రాల పోలీసులు ఫుల్ ఫోకస్ పెట్టారు. విచారణలో రెండు రైళ్లే కాదు.. మరో రైలు అంశం కూడా చేరింది. నిందితులు.. బాలిక శరీర భాగాలను రెండు రైళ్లలో పడేసి.. మూడో రైలులో పారిపోయినట్లు అంచనా వేస్తున్నారు పోలీసులు. ఇంతకీ ఈ ఘటన ఎక్కడ జరిగింది? ఏం జరిగింది? పూర్తి వివరాలు తెలుసుకుందాం.. శనివారం నాడు మోవ్ నుండి నాగ్దా మీదుగా ఇండోర్‌కు తిరిగి వస్తున్న రైలులో ట్రాలీ బ్యాగ్, గోనె సంచులలో ఒక బాలిక శరీర భాగాలు కనిపించాయి. తల, మొండెం మాత్రమే ఆ బ్యాగ్‌లో ఉన్నాయి. కాళ్లు, చేతులు లబించలేదు. అదే రోజు లక్ష్మీబాయి నగర్ నుంచి బయలుదేరి రిషికేశ్ చేరుకున్న రైలులో ఎస్-1, ఎస్-2 కప్లింగ్ మధ్య బియ్యం బస్తాలో రెండు చేతులు, రెండు కాళ్లు కనిపించాయి. వీటిని గుర్తించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు.. విచారణ ప్రారంభించారు. ఈ ఘటన శనివారం జరిగినట్లు గుర్తించిన పోలీసులు.. రైళ్ల రాకపోకలను, అందులో ప్రయాణించిన వారిని పరిశీలించారు. ఆ రోజున సాయంత్రం 5 గంటల నుంచి 5.30 గంటల మధ్య రెండు రైళ్లు ఉజ్జయిని ప్లాట్‌ఫారమ్ నెంబర్ 2, 3పై ఉన్నాయని.. అప్పుడే నిందితులు ఈ బస్తాలను రైళ్లలో వేసి ఉంటారని ప్రాథమిక అంచనాకు వచ్చారు పోలీసులు. అదేవిధంగా ప్లాట్‌ఫామ్ నెంబర్ 5పై నిలిచి ఉన్న మరో రైలు నుంచి నిందితులు తప్పించుకుని ఉంటారని భావిస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించినా.. ఎవరూ అనుమానాస్పదంగా కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు.. నిందితులను కనిపెట్టేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. నిందితులెవరో తెలిపిన వారికి రూ. 10 వేలు రివార్డ్ కూడా ఇస్తామని ప్రకటించారు.

## రియాసి బస్సుపై ఉగ్రదాడి.. 50 మంది అనుమానితులు అరెస్టు



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని రియాసిలో ఓ బస్సుపై ఉగ్రవాదులు దాడి చేసిన ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆ ఘటనతో లింకు ఉన్నట్లు అనుమానిస్తున్న 50 మందిని ఆధీనంలోకి తీసుకున్నారు. రియాసి జిల్లాలో ఓ బస్సుపై కాల్పులు జరపగా, ఆ కాల్పుల్లో 9 మంది మృతిచెందారు. 41 మంది గాయపడ్డారు. 50 మందిని అరెస్టు చేసిన పోలీసులు .. ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఐస్‌క్రీమ్‌లో చేతి వేలు... పోలీసులను ఆశ్రయించిన డాక్టర్



తింటున్న ఐస్‌క్రీమ్‌లో చేతి వేలు ఉండడాన్ని గమనించి డాక్టర్ నిర్ఘాంత పోయారు. ఆ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తులో భాగంగా ఐస్‌క్రీమ్‌లోని చేతి వేలును పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ ఘటన ముంబై మహానగరంలో చోటు చేసుకుంది. పశ్చిమ మలాడ్‌లో నివసిస్తున్న డాక్టర్ (26) భోజనం అనంతరం ఆన్‌లైన్‌లో బటర్ స్కాచ్ కోన్ ఐస్‌క్రీమ్ కోసం ఆర్డర్ పెట్టారు. ఇంటికి వచ్చిన ఐస్‌క్రీమ్ తింటుండగా.. అందులో అర అంగుళం మేర చేతి వేలు ఉండడాన్ని గమనించారు. ఆ చేతి వేలుకి గోరుతోపాటు కండ పట్టి చర్మం ఉండడంతో.. డాక్టర్ ఒకింత ఆందోళనకు గురయ్యారు. దీంతో డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ క్రమంలో చేతి వేలును పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అయితే ఈ చేతి వేలు.. ఎవరిది? మనుషుల దేనా?. ఐస్‌క్రీమ్‌లోకి ఎలా వచ్చింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందులోభాగంగా ఐస్‌క్రీమ్ కంపెనీ సిబ్బందిని సైతం పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

# బడ్జెట్‌పై కసరత్తు!

-మొదటిపేజీ తరువాయి

రూ.53,196 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయానికి రూ.19,746 కోట్లు, నీటిపారుదల కోసం రూ.28,024 కోట్లను ప్రతిపాదించారు. ఇలా నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ కోసం కసరత్తు చేస్తోంది. ఉభయసభలు ఈ బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అయితే ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలు, ఇటీవల ముఖ్యమైన ప్రకటనలను దృష్టిలో పెట్టుకోవాలని ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని సిఎం నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే అన్ని శాఖలు వివిధ పథకాల పద్దులకు సంబంధించిన క్షుణ్ణంగా సమీక్షించుకొని ప్రతిపాదనలు ఇవ్వాలని స్పష్టం చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు దాదాపుగా 6.71 లక్షల కోట్ల అప్పుల భారం ఉండగా వరుసగా ఎఫ్ఆర్ఎంబి పరిధిలో అవకాశాల మేరకు అప్పుల మీద అప్పులు చేస్తూ బాండ్లు తాకట్టు పెడుతూ పాలన కొనసాగిస్తోంది. ఇప్పటికే ఆరునెలల్లో ఎఫ్ఆర్ఎంబి పరిధికి మించి రూ.12,905 కోట్ల అప్పులు చేసింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలతో కలిపి చెల్లింపులకు రేవంత్ ప్రభుత్వం సగటున రోజుకు రూ.290 కోట్ల మేరకు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతోపాటు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాటికి తోడు ఆగష్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీకి రూ.33,000 కోట్ల నుంచి రూ.35,000 కోట్ల వరకు అవసరమని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ హామిని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని, నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో, ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఈ క్రమంలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి రిజర్వ్ బ్యాంకు అంగీకరించాల్సి ఉంటుంది. లేదంటే ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అలాగే రైతుల



పంట బీమాకు ప్రభుత్వం ఏటా 2వేల కోట్ల ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో 1.32కోట్ల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా 2019 నుంచి ఫసల్ బీమా అమల్లో లేదు. ఇప్పుడు ప్రభుత్వం పంటల బీమాకు ప్రీమియం భరించాల్సి ఉంది. ఇకపోతే రైతుబంధు ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలోనే పూర్తి స్థాయి బడ్జెట్‌లో హామీల అమలుకు ఎంత కేటాయిస్తారు? ఆదాయం పెంపుపై ఎలాంటి చర్యలు చేపట్టారన్నది త్వరలోనే తేలనుంది.ఫిబ్రవరిలో నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌కు అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్‌కు మరో 45 రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన చేసేలా ఆర్థికశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో భాగంగా ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను కోరింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల పూర్తి వివరాలను ఇవ్వాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ అంచనాలకు తగిన హేతుబద్ధత ఉండాలని ఆర్థిక శాఖ తెలిపింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర అవసరాలను పరిగణనలోకి తీసుకొని వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలకు లోబడి ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్ కసరత్తుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కేవలం పథకాలకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను మాత్రమే ఇవ్వాలని ఆర్థికశాఖ తెలిపింది. నిర్వహణ వ్యయానికి సంబంధించి గతంలో ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేయాలని పేర్కొంది.

# లోకల్ ఎన్నికల తర్వాతే కొత్త పీసీసీ

-మొదటిపేజీ తరువాయి

భావిస్తోంది. దీనితో భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ తదితర నేతలంతా తమకే పీసీసీ దక్కాలని గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని సమాచారం. అయితే త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిని మారిస్తే తలనొప్పిగా మారొచ్చని అధిష్టానం భావిస్తోందని సమాచారం.ప్రస్తుత సీఎం పీసీసీగా ఉండి అసెంబ్లీలో కష్టపడి తెలంగాణను పవర్ లోకి తెచ్చారని హైకమాండ్ విశ్వసిస్తోంది. పైగా లోక్ సభలోనూ ఫలితాలు బాగానే వచ్చాయి. సీనియర్లందరినీ ఒక తాటిపైకి తేవడం, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడం, అగ్రనేతల పర్యటనలను భారీ ఎత్తున చేసిన ఏర్పాట్లు, అధిష్టానానికి విధేయుడుగా ఉండటం ఇవన్నీ కలిపి హై కమాండ్ వద్ద రేవంత్ కు మంచి పేరే ఉంది. పైగా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో జనాల మద్దతు పొందడంలో రేవంత్ క్రియాశీలక పాత్ర పోషించారని ఏఐసీసీ నమ్ముతోంది. స్థానిక ఎన్నికల తర్వాతే పీసీసీని మారిస్తే సరిపోతుందనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే అందరూ సీనియర్లే కాబట్టి ఎవరికి ఇచ్చినా మిగిలినవారు గ్రూపులుగా విడిపోవచ్చు. ఆ ప్రభావం స్థానిక ఎన్నికలలో చూపించే ప్రమాదం లేకపోలేదు. స్థానిక ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఓకే అనిపించుకుంటే ఇక ఐదేళ్ల దాకా ఢోకా లేదని అధిష్టానం భావిస్తోంది. అందుకే స్థానిక ఎన్నికలు అయ్యేదాకా కొంతకాలం పీసీసీ అధ్యక్షుడిని కంటిన్యూ చేస్తే ఎలా ఉంటుంది? అనే అంశంపై పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దాదాపు ఏడేళ్లు పనిచేశారని కొందరు నేతలు గుర్తు చేసుకుంటున్నారు. పార్టీని పవర్ లోకి తీసుకువచ్చిన రేవంత్ ను మరో టర్మ్ వరకు కొనసాగించే అవకాశం కూడా లేకపోలేదని ఇలాంటి సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉంటేనే మేలనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్... రంగంలోకి ఈడీ

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలోని గత రెండు అసెంబ్లీ ఎన్నికల వేళ.. బీఆర్ఎస్ అభ్యర్థులకు టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో డబ్బు సమకూర్చామని రాధాకిషన్ రావు, ఆయన బృందంలోని అనేకమంది పోలీసు అధికారులు విచారణలో కుండబద్దలు కొట్టటంతో బాటు ఈ వందల కోట్ల అక్రమ నగదు లావాదేవీల విచారణ పేరుతో ఈడీ ఎంటర్ అయ్యే అవకాశం ఉందన్న ప్రచారంతో గులాబీ నేతల్లో భయం మొదలైంది. నిజంగా ఈడీ రంగంలోకి దిగితే ఈ ట్యాపింగ్ వ్యవహారంలో నాడు బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేలుగా పోటీచేసిన నేతలతో బాటు ఈ వ్యవహారంతో కీలకంగా వ్యవహరించిన పెద్ద తలకాయలకూ ఇబ్బందులు తప్పవని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు మీద తెలంగాణ పోలీసులు నాంపల్లి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 68 పేజీల ఛార్జ్‌షీట్‌లో పోలీసులు మొత్తం ఆరుగురిని నిందితులుగా చేర్చగా వీరిలో ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు పరారీలో ఉన్నట్టు సస్పెండైన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, సస్పెండైన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు రిమాండ్‌లో ఉన్నట్టు అందులో వివరించారు. 69 మంది సాక్షుల వాంగ్మూలాలను అభియోగపత్రంలో నమోదు చేశారు. వీరిలో గతంలో ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన పోలీసు అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కూడా ఉన్నారు. వేలాది పేజీల్లో అభియోగాలను బలపరిచే పత్రాలు పొందుపరిచారు. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అంశాలుండడంతో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, మరో నిందితుడిని విచారించాక మరిన్ని ఆధారాలతో పూర్తి అభియోగపత్రం దాఖలు చేయనున్నట్టు తెలిపారు. అయితే.. పోలీసులు చార్జిషీటు దాఖలు చేయటంతో ఈ కేసులో ఈడీ రాక ఖాయమనే వార్తలు వినిపిస్తున్నాయి.ఈ కేసు విచారణలో నిందితులు చెప్పిన దానిని బట్టి 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో ఎన్నికల నిధులు రవాణా అయ్యాయి. ఈనాటి పరిస్థితులను బట్టి ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెడుతున్న ఖర్చు రూ. 60 కోట్ల వరకు ఉంటోందన్నది అందరికీ తెలిసిన విషయమే.




అందులో నాలుగో వంతు ప్రకారం లెక్కగట్టినా ఒక నియోజకవర్గంలో రూ. 15 కోట్ల మొత్తాన్ని నిందితులు తమ వాహనాల్లో వీరు రవాణా చేసి ఉండే అవకాశం ఉంది. తెలంగాణలోని 119 స్థానాల్లో తక్కువలో తక్కువగా 50 స్థానాల్లో ఇలా చేసినా.. ఒక ఎన్నికలో వీరు చేరవేసిన మొత్తం.. రూ. 750 కోట్లు అయి ఉంటుంది. ఈ లెక్కన రెండు అసెంబ్లీ ఎన్నికలకు కలిపి రూ. 1500కు పైగా మొత్తం అక్రమంగా రవాణా అయిందని భావించాలి. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికలతో కలిపి ఈ మొత్తం రూ. 2 వేల కోట్లకు చేరే అవకాశం ఉందనేది ఒక అంచనా. మరి.. ఇంత పెద్దమొత్తంలో ఈ నగదును సమకూర్చిందెవరు? ఎక్కడి నుంచి ఆ వాహనాలు ఎక్కడికి ప్రయాణించాయి? ఆ నగదు అందుకున్నదెవరు? ఈ మొత్తం వ్యవహారాన్ని చక్కబెట్టిందెవరు? అనే అంశాలపై ఈడీ దర్యాప్తు చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే.. నాడు అధికార పార్టీకి ఫండింగ్ చేసిన వ్యాపారవేత్తలు, మద్దతుదారులూ విచారణకు సిద్ధం కావాల్సిందేనని నిపుణులు చెబుతున్నారు.మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సాక్షాత్తూ హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్ ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఓ నిందితుడు (ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ భుజంగరావు) తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వార్తలు గుప్పుమన్న నేపథ్యంలో హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. పలు పత్రికల్లో ఈ అంశంపై వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. సుమోటో పిటిషన్‌పై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇందులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), తెలంగాణ డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఏకంగా న్యాయమూర్తుల ఫోన్‌లనూ ట్యాప్ చేశారనే విషయం బయటికి రావటంతో హైకోర్టు విచారణకు దిగటంతో.. ఈ అంశంపై అన్ని ఆలోచించే విచారణకు దిగాలని ఈడీ భావించే అవకాశాలున్నాయి.ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ రావులు విదేశాలకు పరారు కాగా, వారిని వీలున్నంత త్వరగా ఇక్కడికి తీసుకొచ్చేందుకు తెలంగాణ పోలీసులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో సీఐడీ.. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, ఈ కేసులో పోలీసులు సాధించిన పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస రెడ్డిని అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. కీలక నిందితులను వీలున్నంత త్వరగా తీసుకొచ్చి, వారిని విచారణ చేపడితే ఈ కేసులో సూత్రధారులు, పాత్రధారులెవరనేది స్పష్టంగా తెలిసిపోనుందని విచారణ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణ వ్యాప్తంగా పలువురు పోలీసు అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు చిన్న, పెద్ద అధికారులూ ఉన్నారు. బదిలీల నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు, ఇతర సాక్ష్యాల తాలూకూ ఆధారాలను కాపాడేందుకు పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులకు బుధవారం నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. అడిషినల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. రాజకీయ దురుద్దేశంతోనే తమ క్లయింట్లను అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ, వారిని ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) కోర్టును కోరారు. బెయిల్ పిటిషన్లపై మంగళవారమే వాదనలు పూర్తికాగా.. ఈ పిటిషన్లను కొట్టివేస్తూ న్యాయమూర్తి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్రంలో క్యాంటీన్‌లు!

-మొదటిపేజీ తరువాయి

టూరిజం కార్పొరేషన్ ఎండీ రమేష్ నాయుడు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, దేవాల యాలు, బస్ స్టాండ్‌లు పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాల నిర్వహణలో ప్రత్యేకంగా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఇప్పటికే,'అన్న' క్యాంటీన్ల పేరుతో కేరళలో, దీదీకా రసోయ్ అనే పేరుతో బెంగాల్‌లో నడుస్తున్న క్యాంటీన్‌ల పనితీరుపై అధ్యయనం చేసినట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో కనీసం150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఈ క్యాంటీన్‌ల నిర్వహణను గ్రామైక్య సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణపై ఈ సంఘాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ క్యాంటీన్‌ల పనితీరు, నిర్వహణ, వీటి ఏర్పాటుకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం, వీటి ఏర్పాటుకు రోడ్ మ్యాప్ తదితర అంశాలపై సవివరంగా ప్రణాళికను రూపొందించాల్సింగా గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ ఆదేశించారు.

## ఆ ప్రాజెక్ట్‌కు పేరు మారుస్తాం..



-మొదటిపేజీ తరువాయి

**ఇరిగేషన్ ప్రాజెక్టులకు అన్యాయం: మంత్రి ఉత్తమ్**

6 నెలల్లో చాలా ప్రాజెక్టులు సందర్శించానని.. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు చాలా అన్యాయం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ. 9వేల కోట్లు ఖర్చు పెట్టినా కూడా ఒక ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు. ప్రాజెక్ట్ పూర్తి అయ్యాక సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా పేరు పెడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**కేసీఆర్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు: భట్టి విక్రమార్క**

కేవలం రూ. 2654 కోట్ల తో అయ్యే ప్రాజెక్టును రూ. 20,000 కోట్లు పెంచి ప్రజాధనాన్ని మాజీ సీఎం కేసీఆర్ దుర్వినియోగం చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ. 8000 కోట్లు ఖర్చుపెట్టి కూడా ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారం వచ్చిన వెంటనే రివ్యూ చేసి ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. పనులు త్వరిత గతిన పూర్తి చేయటానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.ఆగస్ట్ 15 వ తేదీలోగా ె ప్రాజెక్ట్ పూర్తి చేసే విధంగా కార్యచరణ రూపొందిస్తామని భట్టి విక్రమార్క అన్నారు.

**పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు పేరు మీద విచ్చల విడిగా డబ్బులు ఖర్చుపెట్టి ఒక్క ప్రాంతంలో కూడా నీరు ఇవ్వలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కానీ ఈ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తుందని హామీ ఇచ్చారు. ఆగస్ట్ 15 వ తేదీ నాటికి నల్గొండ, వైరా ప్రాంతాలకు లక్ష ఇరవై వేల ఎకరాలకు నీరు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాటిచ్చారు.

## మల్లారెడ్డికి టీటీడీపీ బాధ్యతలు?



**హైదరాబాద్ :** తెలంగాణలో రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఫలితాలు తర్వాత ఊహించని మార్పులు వస్తాయని నేతలు బహిరంగంగా చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.దాదాపు ఆరుగురు నేతలు ఇప్పటికే అధినేత చంద్రబాబుతో మంతనాలు జరిపినట్టు అందులోని సారాంశం. అదే జరిగితే కారు పార్టీ ఖాళీ కావడం ఖాయమని చర్చించుకుంటున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లపాటు పాలించింది టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ పార్టీ. అందులోని నేతలంతా దాదాపు టీడీపీ నుంచి వెళ్లినవారే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. బీఆర్ఎస్ బదులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసారి బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లలో తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లినవారు ఉన్నారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడును బీఆర్ఎస్‌లోని చాలామంది నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సొంతగూటికి చేరుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా అందులో వున్నట్లు సమాచారం.తెలంగాణ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లారెడ్డి ఆగడాలు బయటకు వచ్చాయి. ల్యాండ్ కబ్జాలు, కాలేజీలో విద్యార్థుల ధర్నాలు వంటి ఘటనలతో ఆయన కొంత బేజారు అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లకుండా టీడీపీ వైపు వెళ్తేనే బెటరని ఓ వ్యక్తి సలహా ఇచ్చారట. ఈ క్రమంలో చంద్రబాబుతో ఆయన మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. అదే జరిగితే తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నమాట.గతంలో చాలాసార్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. తమ పార్టీ నుంచి వెళ్లిన నేతలు తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. చివరకు పలువురు నేతలకు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పాత్రను తెలుగుదేశం పోషించడం ఖాయమని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ వైపు వెళ్లడం కరెక్ట్ కాదని, మరింత ఒత్తిళ్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ ప్రచారం గురించి మాజీ మంత్రి మల్లారెడ్డి ఏమంటారో చూడాలి.

# నిషేధిత గుట్కా, పొగాకు నిలువలపై పోలీసుల దాడులు

- రూ.3.15 లక్షల నిషేధిత పొగాకు స్వాధీనం
- ఇటీవల ఇచ్చోడలో పట్టుబడిన రూ. 2.80 లక్షల విలువ చేసే గుట్కా
- వరుస పోలీసుల దాడులతో గుట్కా వ్యాపారస్తుల గుండెల్లో గుబులు






**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** నిషేధిత గుట్కా నిల్వలపై పోలీసులు వరుస దాడులు చేస్తున్నారు. ఇటీవల ఇచ్చోడ మండల కేంద్రంలో రెండు రూపాయలు రెండు లక్షల విలువ చేసే నిషేదిత గుట్కా నిల్వలను పట్టుకొని నిందితున్ని అరెస్టు చేశారు. ఈరోజు అర్ధరాత్రి (గురువారం) జిల్లా కేంద్రంలో పోలీసులు నిషేధిత గుట్కా, పొగాకు అక్రమ నిల్వలపై పోలీసులు దాడులు నిర్వహించి రూ.3.15 లక్షల విలువైన పొగాకు నిర్వహణను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని ఆదర్శనగర్'లో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని పొగాకు మత్తు పదార్థాలను ప్రజలకు విక్రయిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి భారీ ఎత్తున పొగాకు సంచులను స్వాధీన పరుచుకున్నారు. దాడుల్లో పొగాకు నిల్వల కేసులో రిక్షా కాలనీకి చెందిన షేక్ అఫ్సర్ ను అరెస్టు చేశామని, మరో ఇద్దరు నిందితులు అక్రమ్, మన్సూర్ (బుక్షాపూర్) పరారీలో ఉన్నట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కేసును ఛేదించిన వారిలో రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నట్టు డీఎస్పీ వివరించారు.

# సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**జయశంకర్ భూపాలపల్లి :** సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భావేష్ మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రులలో కొనసాగుతున్న వైద్య సేవల గురించి వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... వైద్యాధికారులు, వైద్య సిబ్బంది వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మారుమూల మండలాలైన పలిమెల, మహ ముత్తారం, కాటారం మండలాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. మాతా శిశు మరణాలు, చిన్నపిల్లల్లో వచ్చే రక్తహీనత సమస్యలు, టీబి, అంటు వ్యాధుల నిర్మూలన కార్యక్రమాలు జరిగే విధానాన్ని అడిగి



తెలుసుకున్నారు.ఆయుష్మాన్ ఆరోగ్యం, జాతీయ ప్రమాణాల ఆరోగ్య నివేదిక గురించి సమీక్షించారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరియైన సదుపాయాలు లేని వాటికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి మొగుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబటిపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నానని తెలియజేశారు. అలాగే ఎక్కడైతే జాతీయ ప్రమాణాల నివేదికకు ఎంపిక కాబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సదుపాయాల కల్పనకు కొరకు నిధులు మంజూరు చేస్తామన్నారు. రాబోయే మూడు నెలల వర్షాకాలం సీజన్లో వైద్యాధికారులకు వాహన అలవెన్స్ ఇస్తామని, అలాగే వర్షాకాలంలో అన్ని గ్రామాలలో క్షేత్ర పరిశీలన కొరకు ఏఎన్ఎం లకు మరియు అంగన్వాడీ సూపర్వైజర్స్ కు మెడికల్ ఆఫీసర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మాత శిశు సంరక్షణలో భాగంగా లింగ నిష్పత్తి తేడా ఉన్నందున మెడికల్ ఆఫీసర్లు అందరినీ వాటి పై సమీక్ష చేయాల్సిందిగా ఆదేశించారు. వర్షాకాలంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో టీకాలు, అత్యవసరమందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కొమురయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజుడేవిడ్, చిట్యాల సూపరింటెండెంట్, డాక్టర్ తిరుపతి, ప్రోగ్రాం అధికారులు, ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారులు, మల్టి పర్పస్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**ములుగు ప్రతినిధి :**ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకున్నాయని ప్రతి పేదవారికి ఉచిత విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో పంచాయితీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి 2024-25 విద్య సంవత్సరంలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.మంత్రి సీతక్క మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన జరుగుతుందని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు,పాఠ్య పుస్తకాలు,ఉచిత భోజనం , ప్రభుత్వ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు ఉచిత వసతి తో పాటు కాస్మెటిక్స్ ఇతర సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యా రంగాలకు పెద్దపీట వేసిందని విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలలో తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటారని ప్రభుత్వ పాఠశాలలలో వారి ఉజ్వలమైన భవిష్యత్తుకు మొదటి అడుగు పడుతుందని విద్యార్థులు వారి తల్లి తండ్రుల ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయాలని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే గొప్ప విజయాలు సాధిస్తున్నారని , మహనీయుల జీవిత చరిత్ర , వారు చేసిన కృషి ,సాధించిన



విజయాలు విద్యార్థులకు పాఠ్య అంశాలుగా బోధించాలని మంత్రి సూచించారు.గ్రామాలలో ఉండే ప్రాథమిక పాఠశాలలలో అగన్వాడి కేంద్రలలోని చిన్నారులకు ఈ విద్య సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియం నర్సరీ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని , విద్య ద్వారా వచ్చే విజ్ఞానాన్ని ఎవరు దోచుకోలేరని, విజ్ఞానం తరగని నిధి అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య అర్హతలు కలిగిన ఉపాధ్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నారని ,పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాటశాలల్లో అత్యధిక విద్యార్థుల నమోదు కొరకు జూన్ 6 నుండి 19 వరకు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని ఆమె సూచించారు.2024-25 విద్య సంవత్సరంలో జిల్లాలో చదివే 19,645 మంది పిల్లలకు ఒక జత ఉచిత ఏక రూప దుస్తులను మహిళ సంఘాల ద్వారా కుట్టించడం జరిగిందని వాటికోసం ప్రభుత్వం ఒక జత కు 75 రూపాయలు చెల్లించడం జరుగుతుందని జిల్లాలో మొత్తం ఈ విద్య సంవత్సరంలో 1,71,150 ఉచిత పాఠ్య పుస్తకాలకు గాను 1,42,510 పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, 95,913 ఉచిత నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పించడం కోసం జిల్లా లోని ప్రభుత్వ, లోకల్ బాడీ, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల, గురుకులలో 367 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ లను నూతనంగా నియమించి మౌలిక వసతుల కల్పన కొరకు సుమారు రూ. 6.91 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఐటీడీఏ పరిధిలోని 99 ట్రైబల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇట్టి పనులను చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా నేటి వరకు 256 పాఠశాలల్లో ఎంపిక చేసిన అన్ని రకాల పనులు పూర్తి చేస్తున్నాం అని పాఠశాలలో 95% పనులు పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరంలో పాఠశాలలకు 6268 డ్యుయల్ డెస్క్ లు, 449 గ్రీన్ చాక్ బోర్డు లు అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి లక్ష్య సాధనకు కృషి చేసి తల్లిదండ్రుల కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా విద్యను అభ్యసించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ములుగు ఎంపీపీ గండ్ర కోట శ్రీదేవి,డి ఈ ఓ పాణిని, డీఎస్పీ రవీందర్,మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి, ఎం ఈ ఓ లు, విద్యార్థిన, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో సీఎం చంద్రబాబు నాయుడు

**తిరుపతి :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, టీడీపీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, ఆరని శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, సివిఎస్వో నరసింహ కిషోర్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా అమ్మవారి ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకున్న ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

## 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి : హరీశ్ రావు..

**హైదరాబాద్ :** 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి: హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇప్పుడు కేవలం 11 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మనఊరు- మనబడి కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. స్కూళ్లలో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని, బడులకు ఫ్రీ కరెంటు ఇవ్వాలని కోరారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మైపాల్ రెడ్డి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండల కేంద్రంలో సిఎస్ఆర్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మైపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ పద్మ కొండల్ రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ హుస్సేన్, మొగులయ్య మద్దుల బాల్ రెడ్డి దేవేందర్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్ , తుడుం రవి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉట్ల గంగమ్మ జాతరకు నీలం మధును ఆహ్వానించిన నాయకులు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం ఉట్ల గ్రామంలో ఆదివార నాడు మత్స్య శాఖ ఆధ్వర్యంలో వర్షాలు బాగాపడాలని, చెరువు నిండాలని, పంటలు బాగా పండాలని నిర్వహించే గంగమ్మ జాతరకు కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్న గారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ ఉట్ల సుంకర బోయిన మహేష్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పూజారి రాజు, సీనియర్ నాయకులు బోగురు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పూజారి బిక్షపతి, వీరబోయిన సాయికుమార్, బోగరు మల్లేష్, పూజారి శ్రీనివాస్, బుషిగారి బిక్షపతి, బోగురు బాలేష్, కర్రె నాగరాజు, బుషిగారి శ్రీశైలం పూజారి చిన్న శ్రీనివాస్ , మండల నాయకులు నల్తూరు పర్వతాలు, పంబాల గణేష్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎంపీటీసీ



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఎంపీటీసీ లావణ్య నరేష్ స్థానిక నాయకులతో కలిసి పుస్తకాలు పంపిణీ చేశారు. జిన్నారం స్థానిక ఎంపిటిసి లావణ్య నరేష్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏమాత్రం వెనక్కి పోకుండా మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయని జిన్నారం ఎంపీటీసీ తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని అన్నారు. నాణ్యతమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, జిన్నారం మండల యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శంకరయ్య, కోటేష్ గౌడ్, పల్నాటి భాస్కర్, ప్రదీప్ గౌడ్, ఎర్రవల్లి ప్రవీణ్, గోకర్ వెంకటేష్ గౌడ్, బాల్ రెడ్డి, మేదరి కృష్ణ, తొర్రి యాదగిరి, విష్ణు మూర్తి, పుట్టి సురేష్, పుట్టి మహేష్, అశోక్ యాదవ్, నాగారం యాదగిరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత



**వాస్తవ నేస్తం,కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో బుధవారం కనిగెని గంగారం అనే వ్యక్తి మృతి చెందడంతో వారి కుటుంబానికి హనుమాన్ దీక్ష స్వాముల కమిటీ తరుపున అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి పెద్ద అంజన్న, అనిల్, దంబోయ్ సంతోష్, గొల్ల మోహన్, రాము, కల్లాలి సాయిలు, సాయిలు, మక్కయ్య, లింగమయ్య, పెండ్ల పోచయ్య, గోపి, రేవుల పీరుగొండ, కుమ్మరి హన్మాండ్లు,గంగొండ,గంగూలి పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com